

క్రీడా హబ్‌గా తయారు చేస్తాం : శాప్ చైర్మన్


విజ్జి స్టేడియాన్ని పరిశీలిస్తున్న రవినాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
జిల్లాను క్రీడా హబ్‌గా తయారుచేస్తామని శాప్ చైర్మన్ ఎ. రవినాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మితో కలసి బుధవారం నగరంలోని క్రీడా మైదానాలను, కోడిరామ్మూర్తి జిమ్‌ను, రాజీవ్ స్టేడియంను పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో దశల వారీ క్రీడా మైదానాలను ఆధునీకరిస్తామని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ బిల్డింగ్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటుచేస్తామని, కేంద్రనిధులతో విజ్జి స్టేడియంలో 400 మీటర్లు సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను, ఆస్ట్రో టర్ఫ్ హాకీ కోర్ట్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట బోర్డు మెంబర్లు కె.జగదీశ్వరి, ఎమ్‌డి ఎ.రమేష్, పిబివిఎస్ రాజు, క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ రాంబాబు క్రీడా సంఘాల ప్రతినిధులు , డిఎస్‌డిఒ శ్రీధరరావు తదితరులు ఉన్నారు.



ఆర్‌డిఒపై అవినీతి ఆరోపణలు

- పెట్రోల్ బంకు ఎన్‌ఒసికి రూ.5లక్షలు డిమాండ్ చేసినట్టు బయటపడ్డ ఆడియో రికార్డు
- విచారణ కోసం సిసిఎల్ఎ కమిషనర్‌కు కలెక్టర్ సిఫార్సులేఖ
- సిసి సంతోష్ సస్పెన్షన్‌కు ఆదేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఆర్‌డిఒ దాట్లకీర్తిపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెట్రోల్ బంకు ఏర్పాటు విషయంలో ఆమె ఎన్‌ఒసి కోసం రూ.5లక్షల డిమాండ్ చేసినట్టు ఆడియో రికార్డు బయటపడింది. గుర్తు తెలియని ఓ బాధిత ఉద్యోగి పేరిట విడుదలైన టెలిఫోన్ సంభాషణ రికార్డు గడిచిన రెండు రోజులుగా సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఈ టాపిక్ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై స్పందించిన కలెక్టర్ ఫోన్ సంభాషణ చేస్తూ డబ్బులు డిమాండ్ చేసిన ఆర్‌డిఒ సిసి సంతోష్ సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం సంభాషణలో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్‌డిఒ కీర్తిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సిసిఎల్ఎ కమిషనర్‌కు కలెక్టర్ సిఫార్సులేఖ రాసినట్టు తెలిసింది. బొండపల్లి మండలంలో ఒక పెట్రోల్ బంకు పర్మిషన్ విషయంపై ఒక వ్యక్తితో సిసి సంతోష్ వాట్సాప్ కాల్ రికార్డు ఇలా ఉంది.

సీసీ : ఇంతకు ముందు ఒక పని మీద ఫలానా అమౌంట్ చేశారు. అదే అమౌంట్ చేయండి. మేడం గారికి సైట్ చూపించాం. బొండపల్లి తహశీల్దార్‌కు తెలియకుండా చేస్తున్నాం కాబట్టి డబ్బులు ఇచ్చేయాలి. మినిస్టర్ గారి సొంత నియోజకవర్గం కాబట్టి ఆయనకు తెలిసినా మీరు ఇబ్బంది పడతారు. డీల్...ఈజ్ డీల్ అంతే..

బాధితుడు : కొంచెం తగ్గించి చెప్పాలని అడుగుతున్నా అండి.

సీసీ : అన్ని తగ్గించి చేశాను...మీరు ఓకే అంటే ఆర్‌డిఒ గారికి చెప్పి పని చేయిస్తా. రామకృష్ణ అనే వ్యక్తి చెప్పినట్టు చేయండి. మీ పని అవుద్ది. నా సొంత పని కోసం బొండపల్లి తహశీల్దార్‌కు లక్ష రూపాయలు ఇచ్చాను. తండ్రి పేరు మీద ఉన్న ఆస్తి కొడుకు పేరు మీద చేయడానికి లక్షన్నర అడిగారు. అడ్వాన్స్ లక్ష ఇచ్చా...సరిపోదు అని లేట్ చేశారు. మినిస్టర్ గారి దృష్టిలో పెట్టేసాను. ఇప్పుడు మీ సమస్యను వాళ్ల దృష్టిలో పెట్టలేదు. మేడంతో కమిట్ మెంట్ అయ్యాను. అందుకే మిమ్మల్ని పిలిచారు. మీతో మాట్లాడారు. ఆవిడతో మాట్లాడిన తర్వాత మీ ఒపీనియన్ మారి పోయింది. మీ పక్కన ఉన్న వ్యక్తి తేడాగా ఉన్నారు. ఆ మనిషి మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు మనిషి. అందుకే ఆయన చెప్పినా కూడా ఫైల్ అవ్వలేదు. అనుకున్న అమౌంట్ ఇచ్చి క్లోజ్ చేసుకోండి. రేపు సాయంత్రం ఫైల్ అయిపోద్ది.


బాధితుడు : అమౌంట్ ఎక్కువ మందికి ఇవ్వాల్సి వస్తుంది కావున...కొంచెం తగ్గించండి

సీసీ : పాత రికార్డు పెట్టి మేడం గారు ఫైల్ క్లియర్ చేస్తారు. అడిగినంత ఇచ్చి క్లోజ్ చేయండి. రేపు సాయంత్రానికి కలెక్టర్‌కు ఫైల్ పంపిస్తా. ఎవరో పెద్దాయన చేశారు, చెప్తారు అంటే ఆమె చేయదు. నేను ఒప్పుకున్నా కాబట్టి ఆమె చేస్తుంది. 'ఈ పని చేయకపోతే మినిస్టర్ గారు మధ్యలోకి వస్తారని, ఆయనకు తెలిస్తే బాగోదు, కొంచెం తీసుకుని పని చేయండి' అని మా మేడంకి చెప్పాను. నాకు కూడా ఏమీ లేదు. మీరు తర్వాత దయ చూస్తే బాగుంటది. ఆమెను సేటస్ఫై చేయాలి. అధికారిని సేటస్ఫైచేస్తే బాగుంటది. ఆనలు మీరు ప్రోపర్ చానెల్‌లో వెళ్లలేదు. అలా వెళ్తే ఇంత ఉండదు. ఇప్పుడు కరెక్ట్ గానే వెళ్లింది. మీకు వెసులు అడుగు చేయొద్దు.

బాధితుడు : నా పని చేయండంటూ ఆర్‌డిఒ ముందు కన్నీరు కార్చుకున్నా సార్..!

సీసీ : మీరు వెళ్లిన తర్వాత మీ పక్కన ఉన్న వ్యక్తి ఎవరు? అని ఆమె నన్ను అడిగారు. మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు గారి తాలూకా అని చెప్పాను. నా మాట విని మీ పని మీరే చేయించుకోండి."

ఈ ఫోన్ సంభాషణ జరిగి సుమారు ఆరు నెలలు కావస్తున్నట్టుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే సిసి సంతోష్‌ను పార్వతీపురం జిల్లాకు బదిలీ చేశారు. తాజాగా ఆడియో రికార్డు మొత్తం బయటకు రావడంతో కలెక్టర్ స్పందించారు.



అక్టోబరు 7న పైడితల్లమ్మ సిరిమానోత్సవం

14న తెప్పోత్సవం, 21న ఉయ్యాల కంబాల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్
ఉత్తరాంధ్రుల కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఖరారయ్యింది. అక్టోబరు 6న అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 7న సిరిమానోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ప్రకటించారు. అమ్మవారి దేవస్థానం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఉత్సవ వివరాలను వెల్లడించారు. పైడితల్లి అమ్మవారి ఉత్సవాలకు సెప్టెంబరు 12న పందిరిరాటతో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఆరోజున చదురుగుడి వద్ద ఉదయం 9.30 గంటలకు, వనం గుడివద్ద 11 గంటలకు పందిరి రాట వేస్తామని చెప్పారు. అదేరోజున అమ్మవారి మండల దీక్ష ఉదయం 8 గంటలకు చదురగుడి వద్ద ప్రారంభిస్తామన్నారు. అక్టోబరు 2న అర్ధమండల దీక్ష ప్రారంభమవు తుందన్నారు. 6వ తేదీ సోమవారం తొలేళ్ల ఉత్సవం, 7వ తేదీ మంగళ వారం సిరి మానోత్స వం జరుగు తుందని తెలిపారు. పెద్ద చెరువులో 14న తెప్పోత్సవం జరుగు తుంద న్నారు. 19న కలశ "జ్యోతి ఊరేగింపు వనం గుడివద్ద సాయంత్రం 5.30గంటలకు ప్రారంభమవు తుందని చెప్పారు. 21న ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహిస్తామని, 22న చండీ హోమం, పూర్ణా హుతితో పైడి మాంబ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. అదేరోజు అమ్మవారి దీక్షదారులు దీక్ష విరమణ చేస్తారని చెప్పారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇఒ శిరీష, పూజారి వెంకటరావు కోరారు. విలేకర్ల సమావేశంలో ఆలయ సూపరింటిండెంట్ వైవి రమణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు విద్యాహక్కు చట్టం కింద కేటాయించిన 20 శాతం సీట్లలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి అదనపు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు తెలిపారు. ఈ నెల 12 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో (http://cse.ap.gov.in) దరఖాస్తు చేసుకోవాలని, లాటరీ ఫలితాలు ఈనెల 25న విడుదలవుతాయని తెలిపారు. ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


ఎస్‌ఎంఎస్ కంపెనీ గేటు వద్ద మృతదేహంతో బైఠాయించిన కుటుంబ సభ్యులు, కార్మికులు

ఎస్‌ఎంఎస్ పరిశ్రమలో ఉద్యోగి మృతి

పరిహారం కోసం కార్మికుల ఆందోళన

రూ.20 లక్షలు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకారం

ప్రజాశక్తి-పూసపాటిరేగ
ఎస్‌ఎంఎస్ పరిశ్రమ కెమిస్ట్రీ విభాగంలో పనిచేస్తున్న మండలంలోని వెంపడాం గ్రామానికి చెందిన పిన్నింటి శ్రీను (26) బుధవారం మరణించాడు. ఆదివారం ఎ- షిఫ్ట్‌లో డ్యూటీకి హాజరైన శ్రీను, పనిలో ఉంటుండగా ఆకస్మికంగా కుప్పకూలాడు. యాజమాన్యం స్పందించి తొలుత విజయనగరం ఆసుపత్రికి తరలించింది. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబీకులు విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శ్రీను బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, సిఐటియు నాయకుడు బచ్చల సూర్యనారాయణతో కలిసి పరిశ్రమ గేటు ముందు మృతదేహంతో ఆందోళనకు దిగారు. నష్టపరిహారం చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలో చనిపోనందున తాము పరిహారం ఇవ్వలేమని యాజమాన్యం చెప్పడంతో పరిహారం చెల్లించేవరకు అక్కడి నుంచి కదిలేది లేదని కార్మికులు పట్టుబట్టారు. ఉద్యోగంలో ఉండగానే ప్రమాదం జరిగిందని, కాబట్టి తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు పరిశ్రమ ప్రతినిధులు కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వడానికి అంగీకరించడంతో, మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు. మృతుడు శ్రీను తండ్రి గతంలోనే మరణించగా, తల్లి ఆదిలక్ష్మి కుమారుడిపైనా ఆధారపడి జీవిస్తున్నారు.

17న ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ


ప్రజాశక్తి- కంటోన్మెంట్
ఈనెల 17న బొబ్బిలిలో జరిగే ఆశా వర్కర్స్ యూనియన్ నాలుగవ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి కోరారు. బుధవారం ఎల్‌బిజి భవన్‌లో జిల్లా మహాసభ సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ధరలు పెరుగుదలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు సెలవులు ఇవ్వాలన్నారు. అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు వయోపరిమితి 62ఏళ్లకు పెంచిందని, వేతనంతో కూడిన మేటర్నిటీ సెలవులను కూడా మంజూరు చేసిందని, గ్రాడ్యుటీ లక్షా 50 వేలు ప్రకటించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆశా వర్కర్స్ యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బొబ్బిలిలో జరిగే మహాసభకు ఆశా వర్కర్లంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ కోశాధికారి మహాలక్ష్మి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఏడుగురు ఎంపిక

విజయనగరం టౌన్ : జాతీయ స్థాయి వాలీబాల్ స్కూల్ గేమ్స్ పోటీలకు రాష్ట్ర జట్టుకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు బుధవారం స్థానిక విజ్జి మైదానంలో జరిగాయి. ఉదయం జరిగిన బాలికల ఎంపిక ప్రక్రియలో ఏడుగురిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. వర్షం పడటంతో బాలురు ఎంపిక వాయిదా పడింది. ఎంపికైన బాలికలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ రాణిస్తే జాతీయ జాతీయ జట్టుకు ఎంపికవుతారని జిల్లా వాలీబాల్ ఆసోసియేషన్ కార్యదర్శి కెవిఎన్ రాజు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా వ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
దేశ సమగ్రతకు, సౌభ్రాతృత్వానికి త్రివర్ణ పతాకం స్ఫూర్తిగా నిలుస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం చేపట్టిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ జంక్షన్ (బాలాజీ జంక్షన్) నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా మయూరి జంక్షన్ వరకు సాగింది. కార్యాలయ సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ నల్లనయ్య

పోస్టల్‌శాఖ ఆధ్వర్యాన బైక్ ర్యాలీ
హర్ ఘర్ తిరంగా లో భాగంగా తపాలాశాఖ సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. విజయనగరం హెడ్ పోస్ట్ ఆఫీస్ నుండి కోట, గురజాడ అప్పారావు రోడ్డు గుండా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్, తపాలాశాఖ ఉద్యోగులు ,సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తం

- అధికారులంతా ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలి
- సెలవులు రద్దు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్
రానున్న 5రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా అప్రమతంగా ఉండాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మండల ప్రత్యేకాధికరులు, ఇఒపిఆర్‌డిలు, మున్సిపల్ కమిషనర్‌లతో వెబెక్స్ నిర్వహించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులంతా వారి ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలని, ఏ ఒక్కరికి సెలవులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. పూసపాటి రేగ, భోగాపురం మండలాల్లో అధికారులు ఎక్కువ దృష్టి పెట్టాలని, మత్స్యకారులు వేటకు వెళ్ళకుండా చూడాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ 08922 236947 ఏర్పాటు చేశామని, 24/7 డ్యూటీ లో సిబ్బంది ఉంటారని, అత్యవసర సేవల కోసం ప్రజలు, అధికారులు కాల్ చేయాలని తెలిపారు.

రూ. 26 కోట్ల అంచనాతో 44 జలవనరుల పనులు

జలవనరుల శాఖ ద్వారా రిపేర్, రెన్నోవేషణ్, రెస్టరేషణ్ ఆర్ఆర్ఆర్ కింద 26 కోట్ల రూపాయల అంచనాతో 44 పనులకు జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీలో జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారు. నీటివనరుల పునరుద్ధరణ, పరిరక్షణ, , ఆక్రమణల నుండి రక్షించడం, తాగునీటి లభ్యతను పెంచడం , భూగర్భ జలాల రీచార్జ్ కు ఉద్దేశించిన ఈ పథకం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించనున్నాయని కలెక్టర్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ ప్రతిపాదనలను టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ ఆమోదం పొందిన తర్వాత పనులు ప్రారంభం అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ పనులకు ఆమోదం లభిస్తే జిల్లాలో 6873 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని కలెక్టర్ తెలిపారు. సమవేశంలో ఇరిగేషన్ ఇఇ ఎంవి రమణ, గ్రౌండ్ వాటర్ డిడి ప్రవీణ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, సెంట్రల్ వాటర్ కమిషన్ ఎడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు లోగా 2 వేల గృహాలు పూర్తి కావాలి

ఈనెలాఖరు లోగా జిల్లాలో 2 వేల గృహాలను పూర్తి చెయ్యాలని కలెక్టం అంబేద్కర్ అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం రూఫ్ లెవెల్ లో నున్న 2 వేల గృహాలను నెలాఖరుకు పూర్తయ్యేలా చూడాలని ఎంపిడిఒలకు లక్ష్యంగా నిర్ణయించారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్ల తో వెబెక్స్ ద్వారా గృహ నిర్మాణాలపై సమీక్షించారు. జిల్లాలో పిఎంఎవై అర్బన్, గ్రామీణ్ కింద 72,496 గృహాలు మంజూరు కాగా 49,127 గృహాలు పూర్తయ్యాయని, రూఫ్ లెవెల్ లో నున్న 2 వేల ఇళ్లు ఈనెలాఖరుకు, మిగిలిన 21 వేల గృహాలు మార్చి 2026 న్నాటికి పూర్తి చెయ్యాలని లక్ష్యంగా నిర్ణయించారు. కలెక్టరేట్ నుండి హౌసింగ్ పీడీ మురళీ మోహన్ పాల్గొన్నారు.

19న ఐద్వా జిల్లా మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్
మహిళా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 9 వ జిల్లా మహాసభ ఈనెల 19న యూత్ హాస్టల్‌లో జరుగుతుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ తెలిపారు. బుధవారం రామకృష్ణానగర్‌లో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోజు కలెక్టరేట్ నుంచి ర్యాలీ జరుగుతుందన్నారు. మద్యం, మహిళళపై హింసకు వ్యతిరేకంగా, మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వాలపై ఉద్యమం చేపట్టిన సంఘం ఐద్వా అని గుర్తు చేశారు. భవిష్యత్‌లో చేపట్టబోయే పోరాటాల గురించి ఈ మహాసభలో ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తీవ్రమైన జాప్యం చేయడం సరైంది కాదని, వెంటనే ప్రతి మహిళ కు 1500 రూపాయలు పథకం అమలు చేయాలని, ఉచితబస్సు ప్రయాణాన్ని అన్ని బస్సుల్లోనూ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులను అరికట్టేలా చట్టాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు ఎం.జగదాంబ, కర్రి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు చేరని తోటపల్లి నీరు

- అసంపూర్తిగా రామతీర్థసాగర్ పనులు
- నీరు లేక నత్తనడకన వరి నాట్లు
- నేటి డిఆర్‌సి సమావేశంలో చర్చించేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు వర్షాభావం.. అక్కడక్కడా కురుస్తున్న వర్షపునీరూ సముద్రం పాలవుతోంది. గత నెలలో కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల ద్వారా నీరు విడుదల చేసినా చివరి ఆయుకట్టు వరకు నీరు వెళ్లడం లేదు. దీంతో, ఎప్పటి మాదిరిగానే రైతన్న వర్షాల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ముఖ్యంగా జిల్లా సాగునీటి వనరుల్లో అత్యంత కీలకమైన తోటపల్లి నీరు చివరి వరకు వెళ్లడం లేదు. తాటిపూడి, ఆండ్ర తదితర ఆయుకట్టు జలాశయాలు కూడా లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించడం లేదు. రామతీర్థసాగర్ పనుల విషయంలో పాలకుల మాటలకు ఆచరణకు పొంతన కుదరడం లేదు. ఆ విధంగా మునుపెన్నడూ లేనంతగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తున్నప్పటికీ వరి నాట్లు ఇంకా 52శాతానికి మించలేదు. ఇది కూడా అధికారిక లెక్కలు. ఆచరణలో ఇంకా తక్కువగానే ఉందని రైతులు, వ్యవసాయ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు (ఈనెల 14న) జరిగేదోయే డిఆర్‌సి (జిల్లా సమీక్షా సమావేశం)లో జిల్లాలో అత్యంత కీలకమైన వ్యవసాయం, దానికి ఆయువుపట్టులాంటి సాగునీటి రంగాలపై సమగ్ర చర్చజరిగేనా? అన్న సందేహాలు వ్యక్తమౌతోంది.

గౌరు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు పనులు పూర్తికి రూ.519 కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.47.81కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఆచరణలో నిధుల విడుదల అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. దీంతో, పిల్లకాలువలు, స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉండడం, కాలువల నిర్వహణ కూడా సరిగా లేకపోవడంవల్ల లక్ష్యం నీరు గారుతోంది. కుడికాలువ ద్వారా 1,46,226 ఎకరాల ఆయుకట్టు లక్ష్యానికి గాను కేవలం 84వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని సాక్షాత్తు తోటపల్లి ప్రాజెక్టు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో 64వేల ఎకరాల పాత ఆయుకట్టు కూడా తగ్గింది. ముఖ్యంగా చీపురుపల్లి, గుర్ల, పూసపాటిరేగ, అటు రాజాం తదితర మండలాలకు సాగునీరు అందడం లేదు.
రామతీర్థసాగర్ ప్రాజెక్టుకు పనులు 2005లో ప్రారంభించారు. నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం పట్టణానికి తాగునీరు అందించాలన్నది దీని లక్ష్యం. ప్రాజెక్టు డైవర్షన్ కెనాల్ 60శాతం, సొరంగం పనులు 20 శాతం మాత్రమే జరిగాయి. ఇప్పటికే దశాబ్దాలు గడిచిపోవడంతో గ్యారేజీ గేట్లు, ఇతర నిర్మాణాలు తుప్పుపట్టిపోయాయి. ఇంకా కాలువ నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. మిగులు పనులు పూర్తి కావాలంటే రూ.807.55 కోట్లు అవసరం అవసరమౌతాయని అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగానే టిబిపిఆర్ ఇంజినీరింగ్ అధికారులు ఇదే ప్రతిపాదనలు పంపారు. ఇందులో రూ.506.01 కోట్లు అవసరం కాగా, భూసేకరణకు రూ.127.79కోట్లు, పునరావాస కల్పనకు రూ.173.75 కోట్లు చొప్పున అవసరం కానున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో కేటాయించింది కేవలం రూ.6కోట్లు మాత్రమే. దీంతో, ఆయుకట్టుదారుల ఆశలు సన్నగిల్లాయి. సుమారు నాలుగు నెలల క్రితం ఈ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన సాగునీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆదిశగా చర్యలు కనిపించడం లేదు. దీంతో రైతులకు ఏటా సాగునీటికి అవస్థలు తప్పడం లేదు.


నిరసన తెలుపుతున్న రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు,రైతులు


కలెక్టరేట్ వద్ద రైతుల నిరసన

వ్యవసాయంలోకి కార్పొరేట్ కంపెనీలు వద్దని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరంకోట
క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో ..బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తులకు అనుకూల నిర్ణయాలు వ్యతిరేకిస్తూ బుధవారం క్విట్ కార్పొరేట్ పేరుతో రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శివర్మ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లొంగిపోయి వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే చర్యలు చేపడుతున్నారని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎంఎస్. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. మూడు నల్ల చట్టాలను పేరుకు రద్దు చేస్తూనే ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తునారని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి రైతుల నడ్డి విరుస్తున్నారని, రైతులంతా స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం 60శాతం మందికి అందలేదన్నారు. కార్యక్రమంలో కౌలు రైతులసంఘం జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు రాకోటి రాములు, తొత్తడి పైడిపునాయుడు, పాల రైతు లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లోక వరపు అదినారాయణ మూర్తి, గొంప కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా నాయకులు రాయ వరపు సత్యం, గంగు నాయుడు, తమాటపు పైడి నాయుడు, కొత్తల ఎర్రి నాయుడు, కోడెల శ్రీను, సూరి దేవుడు, ఈదుబిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు కార్యక్రమానికి సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు, ఎ.జగన్మోహన్ మద్దతు తెలిపారు.

దోపిడీని అరికట్టాలని జెసికి వినతి

వ్యవసాయ, రెవెన్యూశాఖల్లో ప్రతి పనికీ కమీషన్లు అడిగి దోపిడీ చేస్తున్నారని, ఈ దోపిడీని అరికట్టాలని ఎపి రైతుసంఘం నాయకులు బుధవారం జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్‌కు వినతినిచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ శాఖలో రైతుల భూములు ముటేషన్, రీ సర్వే, తదితర పనులకు ప్రతి సెంటుకూ రూ.500 నుంచి వెయ్యిరూపాయలు వరకు వసూలు చేస్తున్నారని జెసికి తెలిపారు. రాజకీయ బ్రోకర్లు ద్వారా డబ్బులు ఇచ్చిన వారికే పని చేస్తున్నారని, మిగతా వారికి ఏదో ఒక సాకు చూపి తిప్పి పంపుతున్నారని తెలిపారు. జిల్లాలో ఎరువులను సక్రమంగా అందించాలని, అధిక ధరలు అరికట్టాలని కోరారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఓట్ల చోరీని అరికట్టాలని కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట
ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కలిపి చేస్తున్న ఓట్ల చోరీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఓట్లు దొంగతనానికి, రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుకు, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎం. విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కోట్లు దొంగతనం చేసి అధికారంలోకి వచ్చి దేశంలో ప్రజలను విధాలుగా ఇబ్బందులు పెడుతున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారన్నారు. పరిశ్రమ దాటిన ట్రాక్టర్లను నిషేధించాలని, ఆహార గిడ్డంగులను అదానికి అప్పజెప్పాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేపట్టిన రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పలువురు ఎంపిలను అరెస్టు చేయడం మోడీ పిరికిపంద చర్య అని అన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గేదెల తిరుపతిరావు, ఇతర నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

20న స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్
ఈనెల 20న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని సిఇఒ బివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో 1-7 స్థాయి సంఘాల సమావేశాలు జరుగుతాయని తెలిపారు.

విద్యార్థులకు నూతన బడి బస్సు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల పిల్లలు కోసం ఏర్పాటు చేసిన బడి బస్సు ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురై మొరాయిస్తుందని బుధవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి ఎస్‌కోట డిపో యాజమాన్యం స్పందించింది. వెంటనే ఆ పాఠశాలకు నూతన బడిబస్సును ఏర్పాటు చేసి పిల్లలను సకాలంలో పాఠశాలకు చేర్పించింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే పిల్లలు ఎక్కువవడం వల్ల పరిమితికి మించి ప్రయాణించడం ఇబ్బందిగా ఉందని బస్సు పరిమితి పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'మినీ గోకులాలకు బిల్లులు చెల్లిస్తాం'

వేపాడ: 2017లో మినీ గోకులాలు నిర్మించిన రైతులకు 2023లో అరకొరగా బిల్లులు చెల్లించామని ఉపాధి హామీ ఎపిఒ ఆదిలక్ష్మి తెలిపారు. అప్పటిలో 145 మంది రైతులు మినీ గోకులాలు నిర్మించుకున్నారని వారికి మిగిలిన బిల్లులకు సంబంధించి ప్రభుత్వం రూ.26.19 లక్షలు నిధులు విడుదల చేసిందని ఆ నిధులను రైతుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు.

సింగరాయిలో 104 సేవలు

వేపాడ: మండలంలోని సింగరాయి వెల్‌నెస్ సెంటర్ వద్ద 104 వాహన సిబ్బంది బుధవారం వైద్య సేవలందించారు. ఈ వైద్య సేవలకు జగ్గయ్యపేట, అరిగిపాలెం, సింగరాయి గ్రామాలకు చెందిన రోగులకు తనిఖీలు చేపట్టారు. అవసరమైన మందులను సిహెచ్ఒ పార్థసారథి, ఎఎన్ఎంలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మల్లంపేటలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

బొబ్బిలి: బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలో గల మల్లంపేటలో బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పట్టణ వైసిపి నాయకులతో కలిసి బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వార్డు ఇంచార్జులు పోలక్కి, పోల చిన వెంకటరమణ, మాజీ బుడా చైర్మన్ ఇంటి గోపాలరావు, మాజీ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ మెంబర్ తూముల భాస్కరరావు, బొబ్బిలి నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు పాల్గొన్నారు.

ప్రసాద్‌రావు మాస్టారుకు సన్మానం

సంతకవిటి: బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు మంతపూడి ప్రసాద్‌రావు సంగీత సామ్రాట్ అవార్డుతో పాటు బంగారు కంకణ బహుమతి పొందిన సందర్భంగా పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావు ఉపాధ్యాయులు దామోదరరావు, సత్యనారాయణ, కృష్ణ శ్రీరామ్, పురుషోత్తం శ్రీనివాసరావు, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రసాదరావు మాస్టర్ జడ ఉపాధ్యాయుడిగా వృత్తితో పాటు ఘంటసాల సంగీత కళాశాలను ఏర్పాటు చేసి ఎంతోమంది శిక్షణ అందించారని, బాల్యం నుండి కళారంగం పరిచయమైన వ్యక్తి, ఎన్నో సంగీత ప్రదర్శనలు ఇచ్చారని కొనియాడారు.

పారిశుధ్య పనులు పరిశీలన

డెంకాడ (భోగాపురం): భోగాపురం మండలంలోని రెడ్డికంచేరు గ్రామంలో జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ అధికారి డి.మల్లికార్జునరావు బుధవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాల సర్వే, ఆధునిక సాంకేతికతతో మ్యాపింగ్ క్షేత్ర స్థాయి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రతిరోజు చెత్త సేకరణ, వ్యర్థాల వర్గీకరణ, శానిటేషన్ క్లోరినేషన్, పరిసరాల శుభ్రత పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. గ్రామాల సర్వే, ఆధునిక సాంకేతికతతో మ్యాపింగ్ పనులు సమయానికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గాయత్రి, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గంట్యాడ: శరీరానికి హాని కలిగించే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనూరాధ అన్నారు. నరవ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నాషా ముక్తభారత్ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించాలని సమాజంలో అందరూ కలిసి భారతాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు వెంకటరావు, శ్రీనివాసరావు, అంగన్వాడి కార్యకర్త పాపయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకునేందుకు 'సఖి'

కంటోన్మెంట్ : బాధిత మహిళలను ఆదుకొనేందుకు సఖి వన్‌స్టాప్ సెంటర్ వివిధ రకాల సేవలను అందిస్తోందని, ఆ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ విజయలక్ష్మి తెలిపారు. అవసరమైనవారు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 181 హెల్ప్‌లైన్ నెంబరు కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సేవలకు సంబంధించిన పోస్టర్‌ను తమ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు.

జెఎన్‌టియులో రక్తదాన శిబిరం

విజయనగరంటౌన్ : జెఎన్‌టియు జివిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్వర్యంలో బుధవారం మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. జెఎన్‌టియుజివి అనుబంధ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని యూనివర్సిటీ ఇంచార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ ప్రారంభించారు. 130 మంది విద్యార్థులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు రక్తదాతలను అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు, విశాఖలోని ఎన్‌టిఆర్ ట్రస్టు సిబ్బంది రక్తసేకరణ చేపట్టారు.

16 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

విజయనగరం కోట: ఈనెల 16 నుంచి 20వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు తెలిపారు. బుధవారం గురజాడ కళాభారతి కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఏటా ఈ ఉత్సవాలను జిల్లా కేంద్ర గ్రంథాలయం, గురజాడ కళాభారతి ఆడిటోరియంలోనే ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు నెల్లిమర్ల, గజపతినగరం, రాజాం, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మిని ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు తదితరులు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆమె కార్యాలయంలో ఉత్సవాలకు సంబంధించి ఆహ్వాన పత్రికను అందించారు.

అనధికార ప్రచారాలకు అనుమతి లేదు

విజయనగరం టౌన్ : నగరంలో అనధికార ప్రకటనలు, ప్రచారాన్ని అనుమతించేది లేదని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలోని ఓ నగల దుకాణం తన వ్యాపార ప్రచార నిమిత్తం అనుమతులు తీసుకోకుండా చేపడుతున్న ప్రచార వాహనాన్ని ప్రణాళిక సిబ్బంది అడ్డుకున్నారు. స్థానిక కొత్తపేట కుమ్మరి వీధి వద్ద ప్రణాళిక కార్యదర్శి, ఇతర సిబ్బంది వాహనాన్ని నిలుపుదల చేసి అనుమతులను పరిశీలించారు. తాము ఎటువంటి అనుమతులు తీసుకోలేదని తెలపడంతో వాహనాన్ని అడ్డుకొని నగరపాలక సంస్థ ప్రణాళిక అధికారుల వద్దకు తీసుకుని వెళ్లారు. ఇటువంటి విషయంలో తమ సిబ్బంది ఉపేక్షించబోరని, తక్షణమే వాహనాలను, ప్రకటన బోర్డులను స్వాధీనం చేసుకుంటారని చెప్పారు.

సంక్షేమ రాజ్య స్థాపనే ధ్యేయం : ఎమ్మెల్యే

విజయనగరంకోట: సంక్షేమ రాజ్య స్థాపన కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా దుప్పాడ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేస్తున్న అభివృద్ధిని వివరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. టిడిపి మండల కార్యదర్శి గంటా పోలి నాయుడు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, రాకోడు జొన్నవలస ఎంపీటీసీలు రాజేష్, పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విజయనగరంకోట : అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా పలు కళాశాలల నుంచి క్విజ్ పోటీలు నిర్వహించి వారిలో ఉత్తమమైన వారిని ఎంపిక చేసి జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు బుధవారం నగరంలోని మోడల్ హైస్కూలు, మోడల్‌జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టిబి నివారణ అధికారి డాక్టర్‌రాణి, కళాశాల ప్రిన్సిపల్ రుస్కానా పర్విన్ హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.రేఖ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం : మంత్రి



గజపతినగరంలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- గజపతినగరం రూరల్

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అన్నదాత సుఖీ భవ నిధులను రైతులు ఖాతాల్లో వేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు ట్రాక్టర్లతో అన్నదాతలు భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈసందర్భంగా ప్రత్యేకంగా ట్రాక్టర్ నడిపి అన్నదాతల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేరని విమర్శలు చేసిన వైసిపి నేతలు కళ్లు తెరచి రైతులు, ప్రజల ఆనందాన్ని చూడాలన్నారు. గతంలో ఇచ్చిన హామీలన్నిటినీ ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో అప్పులు చేసి వెళ్లిపోయినప్పటికీ నేడు కూటమీ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను విడతల వారీగా అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి పావని, జనసేన పిఎసిఎస్ సభ్యులు, మాజీమంత్రి పడాల అరుణమ్మ, జనసేన ఇన్చార్జ్ ఎం.సురేష్, ఎఎంసి చైర్మన్ గోపాల రాజు, టిడిపి సీనియర్ నాయకులు ప్రదీప్ కుమార్, కుమార్ బాబు, కెరటం రాజేష్ (బుజ్జి), ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే మాధవి, బంగార్రాజు, నాగార్జున

పూసపాటిరేగ, డెంకాడ: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిందని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగారు రాజు అన్నారు. బుధవారం నాతవలస టోల్ గేట్ నుండి పూసపాటిరేగ ఎఎంసి కార్యాలయం వరకు ఆయన ఆధ్వర్యంలో రైతులు ట్రాక్టర్ ర్యాలీ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. నాతవలస జంక్షన్ నుండి పూసపాటిరేగ ఎఎంసి కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మహంతి శంకర్రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్‌నాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల అభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యం

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం అన్నదాతల అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని లక్కవరపుకోట మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ నుంచి ఎస్‌కోట దేవి కూడలి వరకు సుమారు 15 కిలోమీటర్లు 200 ట్రాక్టర్లతో అన్నదాత సుఖీభవ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ అందరి కడుపు నింపే రైతన్నకు ఏ కష్టం రాకూడదని, శ్రమతో సేద్యం చేస్తూ రక్తంతో పంటలు పండిస్తున్న అన్నదాతకు అండగా నిలిచి, అతని కష్టంలో కొంతైనా పంచుకోవాలనే సదుద్దేశంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా తొలి విడత పెట్టుబడి సాయం 7వేలు అందడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతలు ఆనందంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాం ప్రసాద్, దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, గొరపల్లి రాము, గవర, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు మల్ల రామకృష్ణ, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, డైరెక్టర్లు గొంప పోతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గొంప వెంకటరావు ఆధ్వర్యంలో ర్యాలీ

వేపాడ: టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ ట్రాక్టర్లతో ఎస్‌కోటలో జరిగే అన్నదాత సుఖీభవ ర్యాలీకి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆహార భద్రతను కాపాడుకుందామని రైతుల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

అమెరికా సామ్రాజ్యం నుంచి దేశ స్వాతంత్రాన్ని, ఆహార భద్రతను కాపాడుకోవాలని సిఐటియు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎస్.గోపాలం అన్నారు. అమెరికాతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చలకు వ్యతిరేకంగా పట్టణంలోని బలిజిపేట రోడ్డులో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాతో జరుగుతున్న వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి, పౌల్ట్రీ రంగాలను చేర్చాలని అమెరికా పట్టుబడుతుందన్నారు. మన ఎగుమతులపై అదనంగా 25శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ జారీ చేసిన హుకుం పై సంతకం చేయడం అన్యాయమన్నారు. అమెరికా అధ్యక్షుడు సుంకాల విధిస్తూ రంకెలు వేస్తుంటే మన ప్రధాని మౌనం పాటిస్తున్నారని ఆరోపించారు. దీంతో దేశంలో కోట్లాది మంది రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. హిందుత్వ ముసుగులో దేశ స్వాతంత్రాన్ని తాకట్టు పెడుతున్నారన్నారు. అమెరికా షరతులు అంగీకరిస్తే మనం సమృద్ధిగా పండించుకునే గోధుమ, వరి, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవలసి వస్తుందన్నారు. పత్తి, సోయాబిన్, జన్యుమార్పిడి విత్తనాలు పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవలసి వస్తుందన్నారు. దీని వల్ల మన రైతాంగం పంటలు అమ్ముకునే అవకాశం లేక దివాలా తీయడం తప్ప మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



రాజాం : నిరసన తెలుపుతున్న నాయకులు

రాజాం: రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ మాట్లాడుతూ విద్యుత్తు ప్రైవేటీకరణ ద్వారా ప్రజలపై వేల కోట్ల రూపాయలు భారం వెయ్యాలని మోడీ ప్రభుత్వం చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానితో చేసుకున్న ఒప్పందంలో భాగంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు అన్ని రాష్ట్రాల మీద ఒత్తిడి చేస్తుందనే, దేశానికి అవసరమైన ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఆర్డరు అదానికి ఇచ్చారని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున తిరగబడాలని కోరారు. 79వ దేశ స్వాతంత్ర కాలంలో దేశ సంపదను దేశాన్ని విదేశాలకు తాకట్టుపెట్టే మోడీ దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రవి, కనకరాజు, రాజేష్, శ్రీను, గిరి, చినబాబు, కార్మికులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాజాం పట్టణం, మున్సిపాలిటీలకు సిఐటియు అనుబంధ సంఘం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు రాజాం మున్సిపాలిటీలో కార్మిక సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి మరింత పటిష్టంగా తయారు చేయడం కోసం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కమిటీలో యూనియన్ అధ్యక్షులుగా నాగవంశం రవి, కార్యదర్శిగా పి.కనకరాజు, ఉపాధ్యక్షులుగా పి.లక్ష్మి, కోశాధికారిగా ఎన్.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీగా పి.రాజేష్ కమిటీ సభ్యులు ఎన్.చిన్నబాబు, పి.గిరిబాబు, ఎన్.దుర్గాశంకర్ ఎన్నికయ్యారు. ఈ కమిటీని మున్సిపల్ కమీషనర్‌కి పరిచయం చేశారు. మున్సిపల్ అధికారులు సమస్యలపై చర్చిలు జరపాలని కమిషనర్‌కి కోరారు.

సాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే కళావెంకటరావు

గుర్ల: రైతులకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. బుధవారం ఆయన గడిగెడ్డ రిజర్వాయర్ నుండి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిగెడ్డ రిజర్వాయర్ 3,500 ఎకరాలకు సాగునీటిని అందిస్తుందన్నారు. తోటపల్లి నుండి గడిగెడ్డకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కుడి, ఎడమ కాలువల కింద ఉన్న రైతులందరూ సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గడిగెడ్డ రిజర్వాయర్ సాగునీటి సంఘం చైర్మన్ జమ్ము సన్యాసినాయుడు, వైస్ చైర్మన్ రమేష్, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుములరాజు కిరణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్ మహేశ్వర రావు, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మీ, ఇఇ ఎంవి.రమణ, డిఇ గోవిందరావు, జెఇ సంతోష్ వివిధ గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ వద్దు.. భవిష్యత్తు ముద్దు

ప్రజాశక్తి- డెంకాడ

ర్యాగింగ్ వద్దు.. భవిష్యత్తు ముద్దు అని జిలా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ. కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ర్యాగింగ్‌పై బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 1997లో ఏర్పాటు చేసిన ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా విద్యాసంస్థ లోపల లేదా వెలుపల ప్రత్యక్షంగా గాని లేదా పరోక్షంగా గాని ర్యాగింగ్‌కు పాల్పడిన, ప్రోత్సహించినా, ప్రచారం చేసినా ఎవరైనా దోషిగా తేలితే రెండు సంవత్సరాల వరకూ జైలు శిక్ష, పదివేల రూపాయల వరకు జరిమానా విధిస్తామన్నారు. దోషిగా తేలిన విద్యార్థిని కాలేజీ నుంచి డిస్మిస్ చేసే అవకాశంతో పాటు మరి ఏ ఇతర కాలేజీలో జాయిన్ అవ్వకుండా ఉండేవిధంగా చట్టం ఉందని చెప్పారు. కాలేజీలో ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని హితువు పలికారు. ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తులను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒకవేళ ర్యాగింగ్‌కి ఎవరైనా పాల్పడితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు టోల్ ఫ్రీ నెంబర్ 15100కు, లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కోర్టు భవనానికి ప్రత్యక్షంగా ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ కమిటీ, ర్యాగింగ్ స్క్వాడ్‌లు ఉండాలని, గ్రీవెన్స్ బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా కాలేజీలోకి చేరిన విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం కాలేజీ యాజమాన్యం రూపొందించిన సేటు నో ర్యాగింగ్ పోస్టర్‌ను ముఖ్య అతిథి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ అవగాహన సదస్సులో ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్ పీవీ సీతారామరాజు, ఎంవిజిఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ వైఎంసి శేఖర్, భోగాపురం సర్కిల్ ఇన్‌స్పెకర్ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణప్రసాద్, పోలీసులు

ప్రభుత్వ పథకాలపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, రీసర్వే సమస్యలపై అధికారులను నిలదీశారు. బుధవారం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు ముఖ్య అతిథులుగా మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పడాం, టెక్కలి, పారసాం సర్పంచులు, ఎంటిసిలు బొంతు కిరణ్, నేతేటి స్వామి నాయుడు, గొలజాన నారాయణరావు, ఎంపిటిసి సంగం రెడ్డి జగన్నాథం మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం 20వేలు ఇస్తారని చెప్పి కేవలం 7వేలే అకౌంట్‌లో వేశారని అది కూడా కొంతమందికి పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం కూడా వేరే వాళ్ళ అకౌంట్‌లో వేయడం వల్ల పథకం అందలేదని తెలిపారు. దీంతో బాటు రీసర్వే వల్ల డబుల్ ఎంట్రీలు పడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా యంత్రాంగం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని తొలగింపులు, మార్పులు, చేర్పులు చేయాలన్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ పనులు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు చెల్లించలేదని దుయ్యబట్టారు. కాగా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కడివి అక్కడేవున్నాయని లోవోల్టేజ్, వదులుగా ఉన్న తీగలు సరిచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఎఇని నీలదీశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సిబ్బంది కొరత ఉందని టైం ప్రకారం పనులు జరిపించలేక పోతున్నామని సమాధానం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ సభ్యులు తీసుకు వచ్చిన సమస్యలు పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, తహశీల్దార్ కె.శ్రీకాంత్, ఎంపిడిఒ పి.సుదర్శనరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న సర్పంచులు

ప్రమాదాల నివారణకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రహదారి భద్రతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 4 నుండి 10 వరకు 'డ్రంకెన్ డ్రైవ్' పై స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాహనదారులపై 295 కేసులు నమోదు చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందల్ తెలిపారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలను నడపడం వలన కలిగే అనర్థాలను వాహనదారులకు వివరిస్తూ, కౌన్సిలింగ్ నిర్వహించారన్నారు. వాహనాలు నడిపే వాహనదారులు రహదారి భద్రత నియమాలు తప్పని సరిగా పాటించాలన్నారు. ప్రతీ ఒక్కరూ భద్రత ప్రమాణాలను పాటిస్తూ, సురక్షితంగా గమ్య స్థానాలు చేరుకోవాలన్నారు. రహదారి భద్రత నియమాలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు. ప్రత్యేక డ్రైవ్‌ను డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు, సిఐలు పర్యవేక్షించారని తెలిపారు.

గంజాయి వ్యాపారుల ఆస్తుల సీజ్

ఎస్.కోట పోలీసు స్టేషను పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితుడిగా అరెస్టు అయిన గంజాయి వ్యాపారి ఒడిస్సా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా, పంతుల్నా పంచాయత్ నందాపూర్ మండలం పాడువ తాలుకా భాకాపుట్ గ్రామానికి చెందిన నగేష్ బాలరాజు (32)కు చెందిన రూ.56లక్షల విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. 170 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులు 2033 ఏప్రిల్ 17 ఎస్.కోట మండలం దేవిబొమ్మ జంక్షన్ వద్ద ఎస్.కోట పోలీసులకు పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయి అమ్మిన ప్రధాన నిందితుడిగా కూడా నగేష్ ఏ బాలరాజును గుర్తించి సెంట్రల్ జైలుకు రిమాండు నిమిత్తం తరలించారన్నారు. వివిధ ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్నట్లు, వచ్చిన అక్రమ సంపాదనతో రూ.56లక్షల విలువైన స్థిర, చరాస్థులను సంపాదించినట్లుగా గుర్తించామని తెలిపారు.

పిఎసిఎస్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రామభద్రపురం

ఆరికతోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని త్రిసభ్య కమిటీ సభ్యులు బుధవారం స్థానిక కార్యాలయంలో ప్రమాణం చేశారు. ఈ మేరకు డిసిసిబి మేనేజర్ చంద్రమోహన్ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ క్రాంతికుమార్ తీర్మానం రాయించి నియామక పత్రం అందజేశారు. చైర్ పర్సన్‌గా జాగాన ప్రసాదరావు, సభ్యులుగా సంగిరెడ్డి ప్రసాద్, మరిపి కృష్ణమూర్తి నాయుడు నియామకం అయ్యారు. ఈ సందర్భంగా అట్టహాసంగా సంఘ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు మధ్య ప్రమాణం చేశారు. ప్రభుత్వం పరపతి సంఘాల అభివృద్ధికి సిద్ధంగా ఉందని రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాలూ సంఘం ద్వారా రాయితీపై ఇస్తామని, అర్హత కలిగిన రైతులకు రుణ సదుపాయం అందించేందుకు సిద్ధమని నూతన చైర్ పర్సన్ ప్రసాదరావు సభా ముఖంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లు రమేష్, కనకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకులను స్వచ్ఛందంగా అప్పగించాలి

బొబ్బిలి: నాటు తుపాకీలు ఉంటే స్వచ్ఛందంగా అప్పగించాలని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ కోరారు. మండలంలోని మోసూరువలస, చెలివలస, కోయకొండవలస గ్రామాలలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా నాటు తుపాకిలు ఉండడం చట్టరీత్యా నేరమన్నారు. నాటు తుపాకీలుంటే స్వచ్ఛందంగా అప్పగిస్తే ఎటువంటి కేసులుండవని, తాము తనిఖీ చేసిన సమయంలో సీజ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మోసూరువలసలో 25 మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎస్ఐ ఆర్.రమేష్, రామభద్రపురం ఎస్ఐ, వి.ప్రసాద్, బాడంగి ఎస్ఐ, లోకేశ్వరరావు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో యువతకు భవిత

శృంగవరపుకోట: గ్రంథాలయాలతో యువత భవితకు దారులు ఏర్పరుచుకోవచ్చునని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలో గల శాఖ గ్రంథాలయంలో చదువుకొని పోలీస్, సివిల్ ఉద్యోగాలు సాధించిన వసంత గణేష్, నౌదాసరి సన్యాసిరావు, వంతల ప్రవీణ్ కుమార్, పతబోయిన వెంకట శివాజి, లెక్కల గణేష్ అనే ఐదుగురు విద్యార్థులను శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంపిపి సండి సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి, ఎంపిటిసి మజ్జి దేవి విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వచ్చి.. మృత్యుఒడికి

◆పొక్లెయినర్ మీదపడి ట్రాలీ డ్రైవర్ దుర్మరణం ◆మృతుడు బీహార్ వాసిగా గుర్తింపు ◆మెంటాడ యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మెంటాడ

బతుకుతెరువు కోసం బీహార్ నుంచి వచ్చిన యువకుడ్ని ప్రొక్లెయినర్ రూపంలో మృత్యువు కబళించిన విషాద ఉదంతం మండలంలోని వాణిజ గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఇదే ఘటనలో స్థానిక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా అనంతగిరి సమీపంలోని బూరిగ గ్రామం నుంచి మెంటాడ మండలం పిట్టాడ పంచాయతీ చీపురువలస వరకూ 6.6 కిలోమీటర్లు పొడవున 2.5 కోట్ల రూపాయలతో రహదారి నిర్మాణం పనులు చేపడు తున్నారు. గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో సంబంధిత కాంట్రాక్టరు ఇక్కడకు తెచ్చిన యంత్ర సామాగ్రిని ఒక్కొక్కటిగా వేరే చోటుకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రొక్లెయినర్‌ను కూడా తీసుకు వెళ్ళాల్సి ఉండగా, అది మరమ్మతుకు గురవడంతో, ట్రాలీ లారీలోకి మంగళవారం అర్ధరాత్రి వేళ ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తు అది పక్కకు ఒరిగి పోయి కిందకు పడిపోయింది. ట్రాలీ లారీ పక్కనున్న ట్రాలీ డ్రైవర్ ప్రమోద్ కుమార్(35)పై ప్రొక్లైనర్ పడడంతో కింద చిక్కుకొని అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. ఘటనా స్థలంలో ఉన్న మెంటాడకు చెందిన తాడ్డి రాంబాబు కాలు పూర్తిగా విరిగిపోయింది. మృతి చెందిన లారీ డ్రైవర్ ప్రమోద్ కుమార్ వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ రోడ్డు కాంట్రాక్టర్ ఎవరనేది తెలియ రాలేదు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రమోద్ కుమార్ మృతదేహాన్ని క్రేన్ సహాయంతో వెలుపలకు తీసి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం తరలించారు. తీవ్రంగా గాయపడిన రాంబాబును చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. ఎస్ఐ సీతారాం కేసు నమోదు చేసి రెండు వాహనాలను అదుపులోకి తీసుకున్నారు.



పొక్లెయినర్ కింద పడిపోయిన ప్రమోద్

రాంబాబు దయనీయ స్థితి

ఈ ప్రమాదంలో కాలు విరిగిపోయిన తాడ్డి రాంబాబు తల్లిదండ్రులు ఇదివరకే చనిపోయారు. పిన్ని దగ్గర ఉంటున్నాడు. ఈ మధ్య పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇంతలో ఈ ప్రమాదం అతని జీవితాన్ని మరింత అతలాకుతలం చేసిందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

మోటార్ సైకిళ్లు ఢీకొని వ్యక్తి మృతి

ముగ్గురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలస గ్రామంలో రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం పరిధిలో ధర్మపురి గ్రామానికి చెందిన వలిపిల్లి సుధాకర్ (37) తగరపువలస వద్ద ఉన్న దివిస్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఉద్యోగం నిమిత్తం తన ఇంటి వద్ద నుంచి మోటార్ సైకిల్ పై మధ్యాహ్నం దివిస్ కంపెనీకి డ్యూటీకి వెళుతుండగా చింతలవలస గ్రామం దగ్గరికి వచ్చేసరికి అయినాడ జంక్షన్ నుంచి మరో ముగ్గురు ఒకే మోటార్ సైకిల్‌పై ఎదురుగా వచ్చి ఎదురెదురుగా బలంగా ఢీకొన్నారు. దీంతో సుధాకర్‌కు తలకు, నుదుటిపైన, ముఖ భాగం పైన బలమైన గాయాలు తగిలాయి. ఇంకో మోటార్ సైకిల్ పై వస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వీరిని స్థానికుల సహాయంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. అక్కడ సుధాకర్‌ను పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని తెలిపారు, సుధాకర్‌కు భార్యతో పాటు ఒక పాప ఉంది. తండ్రి నారాయణస్వామి ఫిర్యాదు మేరకు డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.